# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
13-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 172

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు**

**ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ**



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో కొత్త పించన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

మిగతా 2లో

## బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

**హైదరాబాద్ వైభవాన్నికాపాడుతాం**

**సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం**

**మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాక్యలు**

**శాసనసభలో క్యూర్?-2026 బిల్లు..**



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో

## భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

**కొత్తగా 1,010 సీట్లు అందుబాటులోకి**

**10,450కి చేరిన మొత్తం సీట్ల సంఖ్య**



**హైదారాబాద్ (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ వైద్య విద్యలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో కొత్తగా 1,010 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో 2026--27 విద్యా

- మిగతా 3వ పేజీలో




## 'ఢిల్లీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర

**బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం**

**డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ**

**పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన**

**ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం**

**భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు**

**ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు**

**పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం**

- మిగతా 2వ పేజీలో

# భారత్, చైనా కలిసి నడవాలి

**పరస్పరం సహకరించుకోవాలి**

**చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి**

**నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం**

**ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు**

**భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక భేటీ**

**సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ**

**ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ పర్యటన**



బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భారత మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ క్రమంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు అంశాలపై ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, అనేక విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక కోణంలో ఇరుపక్షాలు దృష్టిలో ఉంచుకోవడంతోనే చైనా-భారత్ సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనా, భారత్‌లు భిన్నమైనవి.

అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి ఇరు దేశాలు పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. సహాయం చేసుకున్నాయి. దిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరవడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతమైనందుకు మోదీకి నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గత 12 ఏళ్లలో దిల్లీలో తాను పర్యటించడం ఇది రెండోసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. అదే సమయంలో భారత ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని గుర్తు చేసుకున్నారు. తత్ఫలితంగా తమ ఇద్దరి మధ్య అనేక ముఖ్యమైన ఏకాభిప్రాయాలు కుదిరాయని స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో సభ్యులుగా ఇరు దేశాల ఉమ్మడి స్థానాన్ని ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ హైలైట్ చేశారు. మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం చైనా, భారత్‌లకు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. చైనా, భారత్‌లు ఒకరి సామర్థ్యాల

- మిగతా 2వ పేజీలో

## ధరణి పోర్టల్ తో వేలాది ఎకరాలు చెర

**నిషేధిత భూముల జాబితా కొత్తది కాదు**

**భూములను కొల్లగొట్టకూడదనే చట్టం**

**ధరణిలో 23 వేల ఎకరాల అక్రమాలు..**

**భూభారతి ఆషామాషీగా తీసుకురాలేదు**

**అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి**

**ఈనెల 16కు శాసనసభ వాయిదా**

హైదారాబాద్, సెప్టెంబర్ 12(ఆర్ఎన్ఏ): తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది.

- మిగతా 2వ పేజీలో



## భవిష్యత్ టెక్నాలజీ హబ్‌గా అమరావతి

**ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం**

**జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్**

**49 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు**

**విజయవాడ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన**




వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

- మిగతా 2వ పేజీలో



3లో

## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ...

**తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహణ**

**కొండా సురేఖ తొలగింపుపై తలసాని తీవ్ర సెటైర్లు**

**సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగానూ వ్యంగ్యాస్త్రాలు**

**100 రోజుల హామీల అమలుపైనా చురకలు**

## కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

**మెట్రో ప్రయాణికులకు శుభవార్త**

**600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు**

**రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు



- మిగతా 2వ పేజీలో

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం**

**గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం



- మిగతా 2వ పేజీలో




# భారత్, చైనా కలిసి నడవాలి

నుంచి మరొకరు నేర్చుకుంటూ, ఉమ్మడి అభివృద్ధిని సాధించగలవని అన్నారు."భారత్, చైనాలు భిన్నమైన దేశాలు అయినప్పటికీ, ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. చైనా, భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలు. అలాగే గ్లోబల్ సౌత్‌లో కీలకమైనవి. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తు కోసం ఈ రెండు దేశాలపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. నాణ్యమైన సహకారాన్ని ఇరుదేశాలు కొనసాగించాలి. మరింత సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా ఏకీకృతమైన ప్రపంచం కోసం కృషి చేయాలి. తద్వారా ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి సానుకూల శక్తిని అందించాలి. ఇరు దేశాలు ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలి" అని షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. షీ జిన్‌పింగ్‌తో పలు అంశాలపై చర్చించానని వెల్లడించారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు. "మీకు (జిన్‌పింగ్‌ను ఉద్దేశించి) హృదయపూర్వక స్వాగతం పలకడం నాకు చాలా ఆనందంగా ఉంది. బ్రిక్స్ సదస్సులో మీరు చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు. బ్రిక్స్ సమిట్‌కు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇప్పుడు మనకు ద్వైపాక్షిక సహకారంపై చర్చించే అవకాశం లభించింది" అని మోదీ స్పష్టం చేశారు. చివరిసారిగా 2019లో భారత్‌లో పర్యటించిన షీ జిన్‌పింగ్, మళ్లీ ఏడేళ్ల తర్వాత ఇండియా టూర్‌కు వచ్చారు. అంతకుముందు 2016, 2014 జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. అయితే, 2020లో గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్- చైనా మధ్య సంబంధాలు తీవ్రంగా క్షీణించాయి. దీంతో 2019 తర్వాత భారత పర్యటనకు జిన్‌పింగ్ రాలేదు. ఏడేళ్ల తర్వాత మళ్లీ బ్రిక్స్ సదస్సు కోసం ఇండియాకు వచ్చారు.

# భవిష్యత్ టెక్నాలజీ హబ్‌గా అమరావతి

డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది.

# ధరణి పోర్టల్‌తో వేలాది ఎకరాలు చెర

తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఆశామాషీగా తీసుకురాలేదని.. దాదాపు 18 రాష్ట్రాల్లోని అధికారులు అధ్యయనం చేశాక..ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూ భారతికి రూపకల్పన చేశామని స్పష్టం చేశారు. భూభారతి ఎన్ ఐసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే పారదర్శకంగా నడుస్తుందని తెలిపారు. అలాగే 22ఏ నిషేధిత భూముల అంశంపై మాట్లాడుతూ.. 2023 నాటికి 22 ఏ జాబితాలో కోటి 2 లక్షల 52 వేల 690 ఎకరాలకు సంబంధించిన వివరాలను సభ ముందు ఉంచారు మంత్రి పొంగులేటి. వీటిలో అటవీ, అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్? హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు.

# 'దిల్లీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర

(మొదటి పేజీ తరువాయి)

భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విభేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్దమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది.తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.

# భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరానికి రాష్ట్రంలోని 66 మెడికల్ కాలేజీల్లో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10,450కి చేరింది. దేశవ్యాప్తంగా మెడికల్ సీట్ల వివరాలతో మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. తాజా పెంపుతో అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానానికి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 36 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,400 సీట్లు ఉన్నాయి. వీటిలో 4,290 సీట్లు గత సీట్లకు రెన్యువల్ కాగా.. కొత్తగా మరో 110 సీట్లు పెరిగాయి. మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 25 చొప్పున, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్‌లో 30 చొప్పున సీట్లు పెరిగాయి. రాష్ట్రంలోని 30 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మొత్తం 6,050 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 5,150 సీట్లు రెన్యువల్ కాగ.., కొత్తగా 900 సీట్లు చేరాయి. కొత్తగా ఏర్పాటైన రాజరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 150 సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లు ఇప్పటికే ఉన్న పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపు ద్వారా అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య, సీట్ల సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో వైద్య విద్యను జిల్లాల స్థాయికి విస్తరించే ప్రయత్నాలకు ఇది మరింత ఊతమివ్వనుంది. ఎయిమ్స్,



జిప్‌మర్ వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థలను మినహాయిస్తే దేశవ్యాప్తంగా 836 మెడికల్ కాలేజీల్లో 1,40,214 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 445 ప్రభుత్వ కాలేజీల్లో 63,971 సీట్లు, 391 ప్రైవేట్ కాలేజీల్లో 76,243 సీట్లు ఉన్నాయి. కొత్త కాలేజీలు, సీట్ల పెంపు ద్వారా ఈ ఏడాది దేశవ్యాప్తంగా 13,186 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మరో 1,27,028 సీట్లు రెన్యువల్ అయ్యాయి. దేశంలో 15,745 సీట్లతో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ 14,400, తమిళనాడు 14,299, మహారాష్ట్ర 13,249 సీట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 40 మెడికల్ కాలేజీల్లో మొత్తం 7,615 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. మెడికల్ కాలేజీలు తమకు మంజూరైన సీట్ల మేరకే అడ్మిషన్లు ఇవ్వాలని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది. ఒక్క సీటు అదనంగా భర్తీ చేసినా ఎన్ఎంసీ చట్టం-2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అవసరమైతే క్రిమినల్ చర్యలతోపాటు జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపింది. కౌన్సెలింగ్ కమిటీలు కూడా అనుమతించిన సీట్లకు మించి ప్రవేశాలు కల్పించకూడదని స్పష్టం చేసింది. కొత్తగా అనుమతి పొందిన లేదా సీట్లను పెంచుకున్న ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఏడు రోజుల్లోగా ఎంఏఆర్‌బీ డైరెక్టర్ పేరిట ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని స్పష్టం చేసింది. దాని పరిశీలన పూర్తయిన తర్వాతే లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేయనున్నట్లు ఎన్ఎంసీ వెల్లడించింది.

# “చెత్తకు చెక్.. మహిళలకు గౌరవం

### ప్రతి అర కిలోమీటరుకు వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### వాణిజ్య భవనాల్లో మహిళా మరుగుదొడ్లు తప్పనిసరి చేయాలి:

### ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతీ రెడ్డి

**కోదాడ సెప్టెంబర్ 12 (క్రైమ్ మిర్రర్):** పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి అరకిలోమీటరుకు ఒక వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతీ రెడ్డి సూచించారు. కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్సులు, వాణిజ్య భవనాలు, ప్రజా వినియోగ భవనాల్లో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణ పరిశుభ్రత, మహిళల సౌకర్యాల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం రాష్ట్ర శాసనసభలో లి'కోర్ అర్బన్ రీజియన్ (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) బిల్లు--2026'లిపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే పద్మావతీ రెడ్డి మాట్లాడారు. పర్యావరణ సుస్థిరత, వాతావరణ మార్పులపై కార్యాచరణ, లింగ సమానత్వం, సార్వత్రిక ప్రాప్యత, సమ్మిళిత పట్టణ రూపకల్పన, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలతో సమగ్ర కార్యాచరణ వ్యవస్థను ప్రతిపాదించడం అభినందనీయమని పేర్కొన్నారు. వీటితోపాటు ఘన వ్యర్థాల సేకరణ, తరలింపు, శాస్త్రీయ నిర్మూలనకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలని సూచించారు. నగరంపై తొలి అభిప్రాయం పరిశుభ్రతతోనే..ఒక నగరంలోకి ప్రవేశించే వారికి ముందుగా కనిపించే పరిసరాలే ఆ నగరంపై తొలి అభిప్రాయాన్ని కలిగిస్తాయని పద్మావతీ రెడ్డి అన్నారు. పరిశుభ్రమైన రహదారులు, క్రమబద్ధమైన వ్యర్థాల నిర్వహణ, ప్రజలకు అందుబాటులో ఉండే పౌర సదుపాయాలు నగర అభివృద్ధికి ప్రధాన సూచికలని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి ఘన, జీవ వ్యర్థాలు వెలువడుతున్నాయని, నిర్మాణ పనుల ద్వారా శిథిల వ్యర్థాలు, ఆసుపత్రుల నుంచి బయోమెడికల్ వ్యర్థాలు, హోటళ్లు, వీధి ఆహార కేంద్రాల నుంచి ఆహార వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని



వివరించారు. వ్యర్థాల స్వభావానికి అనుగుణంగా వాటిని సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో తరలించి, సురక్షితంగా నిర్మూలించే వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోజువారీ ప్రక్రియగా వ్యర్థాల నిర్వహణ“మనిషి ఉన్న ప్రతి చోటా ప్రతిరోజూ వ్యర్థం ఉత్పత్తి అవుతుంది. కాబట్టి వ్యర్థాల నిర్వహణ అప్పుడప్పుడు చేపట్టే కార్యక్రమంగా కాకుండా నిరంతరాయంగా కొనసాగాల్సిన వ్యవస్థగా ఉండాలి” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో రహదారుల పక్కన, పాదచారుల మార్గాల మూలల్లో, ఖాళీ స్థలాల్లో చెత్తను పారవేస్తున్నారని తెలిపారు. కొద్దిరోజుల్లోనే అవి భారీ చెత్తకుప్పలుగా మారి దుర్వాసనకు కారణమవుతున్నాయని, వీధి కుక్కలు చేరడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీనివల్ల ప్రజారోగ్యంతోపాటు నగర పర్యావరణం, సౌందర్యం దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నగర రూపకర్తలు, ఆర్కిటెక్టుల సహకారంతో ప్రతి అరకిలోమీటరుకు ఒక వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అవి సాధారణ చెత్తకుండీల మాదిరిగా కాకుండా నగర సౌందర్యంలో భాగంగా కనిపించేలా ఆకర్షణీయంగా, శాస్త్రీయ ప్రమాణాలతో రూపకల్పన చేయాలని అన్నారు. మహిళలకు మరుగుదొడ్లు తప్పనిసరి చేయాలి పట్టణ ప్రణాళికలో మహిళల అవసరాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పద్మావతీ రెడ్డి కోరారు. మహిళలు బయటకు వచ్చినప్పుడు సురక్షితమైన, పరిశుభ్రమైన మరుగుదొడ్లు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇది కేవలం సౌకర్యానికి సంబంధించిన అంశం కాదని, మహిళల ఆరోగ్యం, గౌరవానికి సంబంధించిన విషయమని పేర్కొన్నారు. కొత్తగా నిర్మించే ప్రతి షాపింగ్ కాంప్లెక్స్, వాణిజ్య భవనం, ఇతర ప్రజా వినియోగ భవనాల్లో మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్డిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలోనే దీనిని తప్పనిసరి నిబంధనగా చేర్చాలని సూచించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, నిర్వహణ బాధ్యతను సంబంధిత భవన యాజమాన్యానికే అప్పగించాలని అన్నారు. సమ్మిళిత పట్టణాభివృద్ధికి పునాది వేయాలి మహిళలకు మరుగుదొడ్ల ఏర్పాటు ఐచ్ఛిక సదుపాయంగా కాకుండా తప్పనిసరి పౌర అవసరంగా గుర్తించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మహిళల గౌరవం గురించి మాట్లాడటంతోపాటు అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించినప్పుడే నిజమైన సమ్మిళిత పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆచరణాత్మక పరిష్కారాలు రూపొందించాలని సూచించారు. కొత్తగా ఈ వ్యవస్థ పరిధిలోకి వచ్చిన 24 గ్రామాల్లో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి పునాది వేయాలని కోరారు. అభివృద్ధి చెందని ప్రాంతాలకు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించడంతోపాటు, ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలకు ఆర్కిటెక్టులు, పట్టణ ప్రణాళికా నిపుణుల సహకారంతో పరిష్కారాలు కనుగొనాలని సూచించారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మహిళా సౌకర్యాలు, సార్వత్రిక ప్రాప్యత వంటి అంశాలను పట్టణ ప్రణాళికలో తప్పనిసరిగా పొందుపరిస్తే నగర జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు వస్తుందని ఉత్తమ్ పద్మావతీ రెడ్డి పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ...

హైదారాబాద్, సెప్టెంబర్ 12(ఆర్ఎన్ఏ): కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, “కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?” అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. “100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా” అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

హైదారాబాద్: తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

## కన్నతల్లి మరణవార్త తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య..

### మెదక్ జిల్లా పెద్దశంకరంపేట విషాద ఘటన

హైదారాబాద్: అమ్మంటే ప్రేమ.. అమ్మంటే ప్రాణం.. కానీ ఆ కన్నతల్లే లేదనే నిజాన్ని ఆ 19 ఏళ్ల కుమారుడు తట్టుకోలేకపోయాడు. తల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ.. అమ్మ వెళ్లిన దారినే తాను ఎంచుకున్నాడు! మెదక్ జిల్లాలో ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో జరిగిన ఈ జంట ఆత్మహత్యలు స్థానికులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తా లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన బేతమ్మ (45), ఆమె భర్త బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బేతమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

## బాబుతో నడ్డా మర్యాదపూర్వక భేటీ

అమరావతి, సెప్టెంబర్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

## కేసీఆర్ వందేళ్లు బతకాలి - కానీ ప్రతిపక్షంలోనే ఉండాలి...!

### కె సి ఆర్ ఫామ్ హౌస్ కే పరిమితం కావాలి --- ఎమ్మెల్యే వంశీకృష్ణ

### దళిత స్పీకర్ ను అవమానించడం దారుణం ...!

### బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ

### మీ భూ దందాలు బయటకు తీయడానికే 22ఏ--- కేఎల్ఆర్ ఫైర్..!

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ దళితులపై చేస్తున్న అఘాయిత్యాలకు నిరసనగా మహేశ్వరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కె ఎల్ ఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ...మాజీ సీఎం కేసీఆర్ వందేళ్లు బతికి ఉండాలి,కానీ ప్రతిపక్షంలోనే ఉండాలి,ఫామ్ హౌస్ కే పరిమితం కావాలి. అధికారం కోల్పోయాక మళ్లీ ఎలా రావాలని కుట్రలు చేస్తున్నారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. దళితులు ఫామ్ హౌస్ ముందు ఆందోళన చేస్తే పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం దారుణం. ఇది బీజేపీ శుద్ధి రాజకీయాలకు బీఆర్ఎస్ కొనసాగింపే. తెలంగాణ బిల్లును దళిత మహిళ మీరా కుమార్ స్పీకర్ గా ఉండి ప్రవేశపెడితే, సీఎం అయిన కేసీఆర్ ఆమెను ఎలా అవమానిస్తారు?” అని ప్రశ్నించారు. కేఎల్ఆర్ మాట్లాడుతూ...“దళిత స్పీకర్ ను




అవమానించడం దారుణం. కొత్త పట్నం - ఫ్యూచర్ సిటీ వస్తే మహేశ్వరం బాగుపడుతుందని స్థానిక ఎమ్మెల్యేకు భయం. 22ఏ తెచ్చింది బీఆర్ఎస్ నేతల భూ కుంభకోణాలు, పట్టా, అసైన్డ్, దేవాలయ, వక్ఫ్ భూముల దందాలు బయటకు తీయడానికే. మీ దొంగ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు డిపాజిట్లు కూడా రావు” అని అన్నారు. అనంతరం నేతలు శ్రీశైలం హైదరాబాద్ హైవేపై ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు, అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ తీగల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

ఎడిటోరియల్

4 ఆదివారం 13-9-2026

ఈ ప్రపంచం ఒక పెద్ద రంగస్థలం, మనమందరం కేవలం నటులమేనంటూ ఆంగ్ల మహాకవి షేక్స్పియర్ ఆనాడు చెప్పిన మాటలు నేటి సమాజంలో చేదు వాస్తవాలుగా, అక్షర సత్యాలుగా మారిపోయాయి. ఒకప్పుడు ఆత్మీయ పలకరింపులకు, కల్మషం లేని అనుబంధాలకు నిలయంగా ఉన్న మన సమాజంలో, ఇప్పుడు ఒక మనిషి పలకరింపులో ఎంత నిజం ఉందో, ఆ చిరునవ్వు వెనుక ఎంత నటన దాగి ఉందో అర్థం చేసుకోవడం ఒక చిక్కుముడిలా తయారైంది.



# మనుషులు మారారా...మనసులు మారాయా?

నేటి ఆధునిక మానవుడు తన నిజమైన స్వభావాన్ని కప్పిపుచ్చుకుంటూ, ఒకే సమయంలో మూడు వేర్వేరు ముఖాలను మోస్తూ జీవిస్తున్నాడు. ఇంట్లో ఒక రకంగా, బయట సమాజంలో మరో రకంగా, ఇక సోషల్ మీడియా అనే రంగుల ప్రపంచంలో పరిపూర్ణమైన వ్యక్తిగా కనిపించేందుకు ఇంకో రూపంలో నటిస్తున్నాడు. హోదాలు, వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సామాజిక నటనలో భాగస్వాములైపోతుండగా, అసలైన మనిషి ఎక్కడో కనుమరుగైపోతున్నాడని సామాజిక విశ్లేషకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాధారణ వ్యావహారికంలో ఫేస్ మేనేజ్మెంట్ అని పిలిచే ఈ సామాజిక నటన వెనుక తిరస్కరణకు గురవుతామనే భయాలు, ఎదుటివారి మెప్పు పొందాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తాయి. మనసులో కొండంత బాధ ఉన్నా పైకి సంతోషంగా ఉన్నట్లు నవ్వడం, లోపల అసూయను దాచుకుని పైకి శ్రేయోభిలాషిలా సలహాలు ఇవ్వడం నేడు నిత్యకృత్యమైంది. ఉద్యోగ ప్రమోషన్ల కోసం పైఅధికారుల అన్యాయాలను చిరునవ్వుతో సహించడం నుంచి, విడాకుల అంచున ఉన్న దంపతులు సామాజిక మాధ్యమాల్లో హ్యాపీ కపుల్ ఫోటోలు పెట్టడం వరకు ఈ ముసుగుల సంస్కృతి విస్తరించింది. ముఖ్యంగా తెలుగు సమాజంలో ఆడంబరాల కోసం ఆర్థిక స్తోమతకు మించి అప్పులు చేసి పెళ్లిళ్లు చేయడం, విలాసాలను ప్రదర్శించి గొప్పలు చెప్పుకోవాలనుకోవడం ఒక వ్యాధిలా మారుతోంది. దీనివల్ల సమాజంలో కృత్రిమ ప్రమాణాలు ఏర్పడి మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర మానసిక, ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతున్నాయి. ప్రతి బంధంలోనూ అవసరాలు, స్వార్థాలే రాజ్యమేలుతుండటంతో నిజమైన స్నేహాలు, ప్రేమానురాగాలు కొరవడుతున్నాయి.ఇక ఈ కృత్రిమత్వానికి అతిపెద్ద వేదికగా మారిన సోషల్ మీడియా మనుషులను డిజిటల్ భ్రమల్లో ముంచెత్తుతోంది. ఇన్స్టాగ్రామ్ ఫిల్టర్ల వెనుక ముఖం పై మచ్చలనే కాకుండా, మనసులోని వ్యధలను కూడా దాచేస్తూ గంటల తరబడి నటించాల్సి వస్తోంది. విదేశీ ప్రయాణాలు, ఖరీదైన హోటళ్ల ఫోటోలు పెడితేనే విలువ ఉంటుందనే అపోహతో బతుకుతూ, ఇతరుల ఎడిట్ చేసిన కలల జీవితాలతో తమ సాధారణ జీవితాలను పోల్చుకుని నేటి యువత తీవ్ర ఆందోళన, నిరాశలకు లోనవుతోందని పలు పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. భావాలను వ్యక్తపరిస్తే బలహీనతగా భావించే సామాజిక కట్టుబాట్లు, కార్యాలయాల్లో మెప్పు కోసం పడే తాపత్రయం మనుషులను యంత్రాలుగా మార్చేస్తున్నాయి.ఈ నిరంతర అభినయం వల్ల సమాజంలో నమ్మకం పూర్తిగా సడలిపోవడమే కాకుండా, మనుషుల్లో ఒత్తిడి పెరిగి నిద్రలేమి, రక్తపోటు వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. రెండు నిజమైన మనసులు కలవాల్సిన చోట కేవలం రెండు ముసుగులు మాత్రమే మాట్లాడుకుంటుండటంతో ఆత్మీయత కొరవడుతోంది. ఈ రంగుల లోకం నుంచి బయటపడాలంటే మన ఆలోచనలు, మాటలు, ప్రవర్తన ఒకేలా ఉండే ప్రామాణికమైన జీవితాన్ని గడపడం అలవాటు చేసుకోవాలి. మన బలాలను, బలహీనతలను నిజాయితీగా అంగీకరించే ధైర్యాన్ని పెంచుకోవాలి. పిల్లలకు చిన్ననాటి నుంచే భావోద్వేగాలను దాచుకోకుండా వ్యక్తపరచడం, విజయాలతో పాటు అపజయాలను హుందాగా స్వీకరించడం నేర్పించాలి. డబ్బు, హోదాల కంటే నిజాయితీగా జీవించడమే గొప్పతనానికి కొలమానమనే భావన సమాజంలో పెరిగినప్పుడే, ఈ ప్రపంచం ఒక కృత్రిమ రంగస్థలం నుంచి స్నేహపూర్వకమైన అందమైన నివాస స్థలంగా మారుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169



ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత్ మరో చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ... ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలకమైన సరఫరా వ్యవస్థల పరిరక్షణే లక్ష్యంగా ఈ రెండు రోజుల సదస్సు సాగుతుంది. సవాళ్లతో కూడుకున్న ప్రపంచ పరిస్థితులలో ఒక బలమైన అనుసంధానకర్తగా తన నాయకత్వాన్ని చాటుకునేందుకు భారత్ ముందుకు సాగుతుంది. మరోవైపు ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చారిత్రాత్మకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో.. ఈ వేదిక ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోందన్నారు. 20 ఏళ్ల వయసు మానవ జీవితంలో పరిపక్వత, బాధ్యతలు పెరిగే దశకు సంకేతమని.. అదే విధంగా బ్రిక్స్ కూడా తన పరిణతి దశకు చేరుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా.. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నదే బ్రిక్స్ విధానంగా ఉండాలని ఆయన అన్నారు. సభ్య దేశాల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగంతో ప్రారంభమైంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. ప్రపంచ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, ఆర్థిక సంస్థల్లో మార్పులు వంటి అంశాలపై ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాబోయే 20 ఏళ్లకు బ్రిక్స్ ఒక కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత ప్రజా కేంద్రిత, మానవతా ప్రథమ విధానం ఆధారంగా

# బ్రిక్స్‌కు సరికొత్త దిశ..

కొనసాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. సౌలభ్యం, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం తమ ప్రాధాన్యతలని వెల్లడించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలకు సంబంధించి సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ రోడ్‌మ్యాప్‌కు ప్రాతినిధ్యం, స్పందన/జవాబుదారీతనం, నియమాల రూపకల్పన అనే మూడు అంశాలు ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలు మరింత సమగ్రంగా ఉండాలని ఆయన అన్నారు.ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పరిస్థితులు మారుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్య వ్యవస్థ మాత్రం మార్పులకు అనుగుణంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న దేశాలకు గ్లోబల్ ఎకనామిక్ గవర్నెన్స్‌లో తగిన పాత్ర లభించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలకంగా ఉన్న దేశాలు.. ప్రపంచ ఆర్థిక పాలనను రూపొందించే ప్రక్రియలో కూడా తగిన స్థానం పొందాలని స్పష్టం చేశారు.రాబోయే 20 ఏళ్లకు కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో బ్రిక్స్ ముందుకు సాగాలని ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదించారు. ప్రతి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష పదవి మారుతున్నప్పటికీ.. దీనివల్ల సంస్థాగత కార్యక్రమాల వేగం తగ్గకూడదన్నారు. ఇందుకోసం 'కొనసాగింపు మరియు అమలు యంత్రాంగం' ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదిస్తోందని తెలిపారు. దీని కింద బ్రిక్స్ కార్యక్రమాలు, నిర్ణయాలు, ఫలితాలను ట్రోయికా ద్వారా పర్యవేక్షించవచ్చని సూచించారు. ప్రపంచ సంక్షోభాలను ఎదుర్కొనే విషయంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియల్లో మాత్రం వెనుకబడి ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ.. 'విశేషాధికారాల పిరమిడ్'ను 'భాగస్వామ్య వేదిక'గా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతి దేశం గొంతు వినిపించేలా, ప్రతి సభ్యుడికి భాగస్వామ్యం ఉండేలా ప్రపంచ వ్యవస్థ మారాలని అన్నారు. అంతర్జాతీయ నిర్ణయాల్లో మానవాళి అభివృద్ధినే కేంద్రంగా ఉంచాలని ప్రధాని స్పష్టం చేశారు.మొత్తంగా.. బ్రిక్స్ 20 ఏళ్ల ప్రయాణాన్ని కొత్త దశగా అభివర్ణించిన ప్రధాని మోదీ.. రాబోయే రెండు దశాబ్దాలకు సంస్థను మరింత ప్రభావవంతమైన, సమగ్ర, ఫలితాల ఆధారిత వేదికగా మార్చేందుకు భారత్ తరఫున పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ముఖ్యంగా సంస్కరణలు, గ్లోబల్ ఆర్థిక సంస్థల్లో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలపై మోదీ ప్రసంగం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదేమైనా ఈసారి భారత్ లో జరిగే ఈ సదస్సుపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం



### చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం
### అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ
### కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం. రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ- ఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
### రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ

న్యూఢిల్లీ: ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# 253 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

### అమరావతిలోని తుళ్లూరులో నిర్మాణం
### ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి

అమరావతి:రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు.

# సీఎం రేవంత్ రెడ్డి సహకారం.. బండి రమేష్ చొరవతో
# రూ.3.32 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

## కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్





**కూకట్ పల్లి, సెప్టెంబర్ 12 (క్రైమ్ మిర్రర్) :** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులను భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా లభించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సహకారం, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి రమేష్ చొరవతో బోయినపల్లి సర్కిల్ పరిధికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.3,32,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ బోయినపల్లి సర్కిల్ పరిధికి చెందిన పలువురు బాధితులు కూకట్‌పల్లిలోని హేమదుర్గ భవన్‌లో ఉన్న బండి రమేష్ కార్యాలయాన్ని సంప్రదించారు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్న బండి రమేష్, లబ్ధిదారుల విజ్ఞప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్నారు.

**ఆరుగురు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, బండి రమేష్ కృషి ఫలితంగా మంజూరైన చెక్కులను శనివారం హేమదుర్గ భవన్‌లోని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారుల వివరాల ప్రకారం పొట్టేటి గౌతమి, కేర్ ఆఫ్ పొట్టేటి రవీందర్ --- రూ.60,000

- గౌసియా బేగం, కుమార్తె మొహమ్మద్ దస్తగిరి --- రూ.50,000
- తమ్మిరి కృష్ణవేణి, కేర్ ఆఫ్ రామాచారి --- రూ.60,000
- దేవుళ్ల నీలం రాజు, కుమారుడు దేవుళ్ల ప్రకాష్ --- రూ.60,000
- కడిపప్పుల్ ఫ్రాన్సిస్, కుమారుడు వెంకట రత్నం --- రూ.42,500
- మండల చంద్రకళ, కేర్ ఆఫ్ రామిరెడ్డి --- రూ.60,000

కష్టకాలంలో సీఎంఆర్ఎఫ్ అండ ప్రభుత్వ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన బండి రమేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలవడం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, నాగార్జున, శివ చౌదరి, నలినీ కాంత్, వరుణ్, జహంగీర్, సజ్జన్, సంధ్య, జోజమ్మ, కల్పన, రజిని, మారుతి తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో మానసిక ఉల్లాసం
# సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్

## మందమర్రిలో సింగరేణి 62వ వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం



**మందమర్రి సెప్టెంబర్ 11 (క్రైమ్ మిర్రర్) :** క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని సింగరేణి సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం.కార్తీక్ అన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం నిర్వహిస్తున్న 62వ వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలలో భాగంగా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను సిఈఆర్ క్లబ్ కార్యదర్శి పెద్దపల్లి బాణయ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ... నిత్యం పని ఒత్తిడితో గడిపే ఉద్యోగులు, కార్మికులకు క్రీడలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివకృష్ణ, జనరల్ కెప్టెన్ శ్రీనుతో పాటు పలువురు అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# వినాయక అగమన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 12 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ పరిలోని ఎల్లమ్మబండ కురుమ సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక అగమన కార్యక్రమంలో కాంగ్రెస్ సినియర్ నాయకులు జిల్లా గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ వినాయక నవరాత్రులు సందర్బంగా నిర్వహించిన కార్యక్రమంలో అగమన ఊరేగింపులో నన్ను ముఖ్య అతిధిగా పిలవడం ఆనందంగా ఉందని, అలాగే నవరాత్రులు పండుగ అనందంగా జరుపుకోవాలని, వినాయక కృప మన అందరిపైన ఉండి సుఖసంతోషాలతో ఆనందంగా వుండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంగం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడే మేలు

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: మేయర్ దర్ని మధుకర్

**మంచిర్యాల సెప్టెంబర్ 11 (క్రైమ్ మిర్రర్) :** వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మేయర్ దర్ని మధుకర్ కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో శనివారం సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మేయర్ దర్ని మధుకర్, కమిషనర్ జి. అన్వేష్‌తో కలిసి సిబ్బందికి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పర్యావరణానికి అనుకూలమైన మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారుచేసిన విగ్రహాల వల్ల నిమజ్జనం సమయంలో నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ, అదనపు కమిషనర్ రాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# పెబ్బేరులో చోళ గోల్డ్ లోన్ బ్యాంకు ప్రారంభం

## మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి సెప్టెంబర్ 12 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో 'చోళ గోల్డ్ లోన్' నూతన సేవలను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. స్థానిక ప్రజలకు, రైతులకు మరియు చిన్న తరహా వ్యాపారులకు అత్యవసర ఆర్థిక అవసరాల కోసం చోళ గోల్డ్ లోన్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందిస్తూ, తక్కువ వడ్డీ రేట్లకే బంగారంపై రుణాలు అందించాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. పెబ్బేరు పట్టణంలో చోళ సంస్థ తమ నూతన సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చోళ గోల్డ్ లోన్ రీజినల్ బిజినెస్ మేనేజర్ రవీంద్రనాథ్ ఠాకూర్, రీజినల్ ఆపరేషన్ మేనేజర్ నాగరాజ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ భాను ప్రకాష్ రెడ్డి, చోళ గోల్డ్ బిజినెస్ సిబ్బంది, స్థానిక పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# పోలాలబస్తి మల్లన్న దేవాలయం రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 (క్రైమ్ మిర్రర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ నగర్ పోలాల బస్తిలో వెలసిన మల్లన్న స్వామి ఆలయం రహదారి సీసీ రోడ్డు పనులకు శనివారం మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం దాదాపు ఆరు లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను మంజూరు చేపించడం జరిగిందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్, బిజెపి నాయకులు పున్నారెడ్డి, స్థానిక నాయకులు దేపె కృష్ణ, భాస్కర్ రెడ్డి, రాములు, రాజు, భాస్కర్, ప్రేమ్ చందర్ రెడ్డి, వేణుగోపాల్, దేవేందర్, అర్జున్, డిజె సాయి తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యల చేసిన ఎమ్మెల్సీ మధును సస్పెండ్ చేయాలి

## కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన ర్యాలీ




**వనపర్తి సెప్టెంబర్12 క్రైమ్ మిర్రర్ :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలని పెబ్బేరు పట్టణంలోని సుభాస్ చంద్రబోస్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దళిత నాయకుడైన స్పీకర్‌పై వ్యాఖ్యలుచేయడం దళిత సమాజాన్ని అవమానించడమేనన్నారు. మధును వెంటనే బర్తరఫ్ చేయాలని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని కేసీఆర్ విస్మరించారన్నారు. దళిత నాయకుడు స్పీకర్‌గా ఉన్నాడనే కారణంతో కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదన్నారు. స్పీకర్‌ను అవమా నించడమంటే యావత్ తెలం గాణ ప్రజలను అవమానిం చినట్లేనన్నారు. దళిత స్పీకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు దళితుల పట్ల చూపిస్తున్న వివక్షకు ప్రజలు రాబోయే కాలంలో తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్ సర్కారును ప్రజలు ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# శంషాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఉద్యోగి మృతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-44 పై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న సయ్యద్ జహీరుద్దీన్ అహ్మద్ (57) మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం సుమారు 11:30 నుంచి 11:40 గంటల మధ్య అగర్వాల్ ఎస్టేట్ సమీపంలో, పాత మదన్‌పల్లి తండా నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. సయ్యద్ జహీరుద్దీన్ అహ్మద్ తన ఓలా స్కూటీ (టిఎస్11ఈజెడ్0038)పై ఇంటి నుంచి షాద్‌నగర్ వైపు విధులకు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయన స్కూటీని ఢీకొట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వాహనం అధిక వేగంతో, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఢీకొన్న తీవ్రతకు జహీరుద్దీన్ అహ్మద్ రోడ్డుపై పడిపోగా, తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ వాహనం వివరాలను సేకరించే పనిలో ఉన్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించడంతో పాటు, నిందిత వాహనాన్ని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని షామ్షాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.



# రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

## న్యాయమ్నరీర్తి అపర్ణదేవి

### జాతీయ లోక్ అదాలత్ లో 3,256 కేసుల పరిష్కారం.

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పెండింగ్ లో ఉన్న కేసులు రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా అదనపు జడ్జి అపర్ణదేవి తెలియజేసారు. ఈ నెల 7 నుండి 12 వరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ కోర్టు భవనముల సముదాయం లో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 3,256 కేసులను పరిష్కరించారు, వాటిలో రాజీ పడిన కేసులు 174, అడ్మిషన్ కేసులు 643, విద్యుత్ చౌర్యం కేసులు 45, సైబర్ క్రైమ్ 21 కేసులు ,డ్రేంకన్ డ్రైవ్ 2,331 కేసులు, ఇ-పెట్టి కేసులు 42 పరిష్కరించారు, ఈ కార్యక్రమంలో జడ్జిలు సుచరిత, స్వప్న, నర్మద, నరేష్, ఉదయ్ నాయక్, రత్నకుమారి, వేణుగోపాల్ రెడ్డి, ఏపిపిలు సుజన, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికాంత్ రెడ్డి, కార్యదర్శి నరసింహ చారి, లోక్ అదాలత్ సభ్యులు, శ్రీధర్ రెడ్డి, సుజాత, అనిల్ చారి, తులసిరామ్ నాయక్, రజనీకాంత్ గౌడ్, సోమశేఖర్, ఉష, ప్రవిణ్, సునీత, అస్మ, కోర్టు సిబ్బంది డేవిడ్ రాజ్, మహేందర్, నరేష్ గౌడ్ , న్యాయవాదులు పాల్గొన్నారు

# మట్టి గణనాధులను పూజించి పర్యావరణాన్ని కాపాడుదాం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** హైదర్‌గూడలోని షిండే ఆర్ట్? ఎడ్యుకేషన్ డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ క్లాసెస్లో భాగంగా ఎకో-ఫ్రెండ్లీ గణేష్ మేకింగ్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని మట్టితో అందమైన వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేశారు. ఈ మట్టి వినాయకుల తయారీలో పర్యావరణానికి ఉపయోగపడే విధంగా వివిధ రకాల విత్తనాలను మట్టిలో ఉంచారు. అనంతరం గణేష్ నవరాత్రుల తర్వాత ఈ వినాయక విగ్రహాలను చెట్టు కుండీలలోనే నిమర్జనం చేయనున్నారు. మట్టి కరిగిన తర్వాత అందులోని విత్తనాల నుంచి మొక్కలు మొలిచి, ప్రకృతికి ఉపయోగపేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా షిండే ఆర్ట్? ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు, కళాకారుడు హర్షవర్ధన్‌షిండే మాట్లాడుతూ మట్టి వినాయకులకు పూజ చేయడం ద్వారా సంప్రదాయాన్ని గౌరవించడంతో పాటు ప్రకృతిని కూడా కాపాడవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని, అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మట్టి వినాయకుడు-పూజతో పాటు ప్రకృతికి జీవనం అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా పెంపొందించిందన్నారు.

# అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి హైదరాబాదులో విద్యాభూషణ్ పురస్కారం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి విద్యాభూషణ్ పురస్కారం వరించింది. విశాఖపట్నం కు చెందిన అబ్దుల్ కలాం మెమోరియల్ ఆర్గనైజేషన్ వారు గుగ్గిళ్ళ దివ్యమూర్తి యొక్క ప్రతిభను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు తెలియజేశారు.ఈ అవార్డును దివ్యమూర్తి హైదరాబాదులోని నారాయణగూడలో శనివారం నాడు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. తదనంతరం గుగ్గిళ్ళ దివ్యమూర్తిని శాలువాతో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం మరియు సన్మానం జరగడం తనకు సంతోషంగా ఉందని తెలియజేశారు. ఇప్పటివరకు తనకు 82 అవార్డులు వచ్చాయని, 146 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గజవెల్లి నరసింహ రాములు, గద్దె వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పడమటి శ్రీధర్ రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పడమటి శ్రీధర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన నివాసంలో శ్రీధర్ రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పీసీసీ, డీసీసీ అధ్యక్షులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తూ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదురి ప్రభాకర్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి, రగడంపల్లి శ్రావణ్ కుమార్, శ్రీకాంత్ ముదిరాజ్, దాసరి రమేష్, శ్రీనివాస్ యాదవ్, షేక్ సిరాజ్, రాపోలు సత్తయ్య, బద్దం శ్రీధర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడి వైపు కేఎన్ఎం విద్యార్థులు



### విత్తనాలతో విగ్రహాల తయారీ


### పర్యావరణ పరిరక్షణపై అవగాహన


### చదువుతోపాటు సమాజహితంపై ఆలోచించాలి: ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 12: పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కళాశాలలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మట్టి, విత్తనాలతో విభిన్న ఆకృతుల్లో విగ్రహాలను రూపొందించారు. సహజ రంగులతో వాటిని అందంగా అలంకరించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సమాజహితం, పర్యావరణ పరిరక్షణపై బాధ్యతతో ఆలోచించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారయ్యే విగ్ర హాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. మట్టి వినాయ కులను వినియోగించడం ద్వారా నీటి కాలు ష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్క రూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.విగ్రహాల నిమజ్జనం సమ యంలో యువత తగిన జాగ్రత్తలు తీసుకో వాలని, మద్యం, మత్తుప దార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మట్టి వినాయకుల తయారీ ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగడంతోపాటు సంప్రదాయ కళల పట్ల ఆసక్తి పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# యాదగిరిగుట్ట పీఆర్టీయూ అధ్యక్షునిగా గడ్డమీది పాండురంగం గౌడ్

## ప్రధాన కార్యదర్శి గా షారాజీ బాబు





**క్రైమ్ మిర్రర్,యాదగిరిగుట్ట:-** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం కేంద్రంలో లో పీఆర్టీయూ యాదగిరిగుట్ట మండలం శాఖ సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పీఆర్టీయూ అధ్యక్షునిగా గడ్డమీది పాండురంగం గౌడ్, ప్రధాన కార్యదర్శి గా షారాజీ బాబు ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి , జిల్లా జనరల్ సెక్రటరీ మధు , రాష్ట్ర అకాడమిక్ గైడెన్స్ కమిటీ చైర్మన్ శ్రీ జాలిగామా రామ్మోహన్ రావు, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు ప్రాథమిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తేజస్విని నగర్‌లో మట్టి వినాయకుల పంపిణీ

### ఐదేళ్లుగా పర్యావరణహిత వినాయక విగ్రహాల పంపిణీ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ డివిజన్-112 పరిధిలోని తేజస్విని నగర్ కాలనీలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా కాలనీలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తుండగా, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా సుమారు 200 మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్-112 బిఆర్ఎస్ మాజీ వార్డు కమిటీ సభ్యులు మధు బాబు మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా చెరువులు, నీటి వనరులు కాలుష్యం కాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో పర్యావరణహిత వినాయక విగ్రహాలపై అవగాహన పెంచేందుకు గత ఐదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. కార్యక్రమానికి కాలనీ వాసులు స్పందిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

# బాలాజీనగర్ కాలనీలో మట్టి వినాయకుల పంపిణీ





గండిపేట(క్రైమ్ మిర్రర్): బాలాజీనగర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై కాలనీ వాసులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా చెరువులు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పర్యావరణహిత వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, సీనియర్ నాయకులు నరేష్, కిరణ్ కుమార్, ముత్యాలు, బాల్ రెడ్డితో పాటు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు. మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించిన కాలనీ వాసులు నిర్వాహకులను అభినందించారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

## రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు

## జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో 3 వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాజీ మార్గమే రాజ మార్గమని రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9 సత్తుపల్లిలో 3 మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు బ్యాంక్ రికవరీ కేసులు చెక్ బౌన్స్ కేసులు కుటుంబ/వైవాహిక వివాదాలు ప్రీ-లిటిగేషన్ కేసులు వినియోగదారుల వివాదాలు రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం ధనం ఆదా అవుతుందని కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ పోలీసు విభాగం న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5 వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ బార్ కౌన్సిల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ శీనయ్య ఎస్సీ ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పిపి కృష్ణార్జున్ కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్ బార్ కౌన్సిల్ సభ్యులు ఎం శ్రీనివాస రావు బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస న్యాయమూర్తులు కల్పన శివరంజని మురళీమోహన్ జ్యోతిర్మయి రజని బిందుప్రియ ప్రవీణ్ నాగలక్ష్మి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్యానెల్ అడ్వకేట్లు వివిధ శాఖల అధికారులు బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ లో ట్రాన్స్ జెండర్లకు పోలీసుల కౌన్సెలింగ్

### బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు --- ఇన్స్పెక్టర్ హెచ్చరిక

### బలవంతపు వసూళ్లు, బెదిరింపులు, వేధింపులకు గురైతే వెంటనే పోలీస్ ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ 112 కు కాల్ చెయ్యండి..!



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సబితా ఇంద్రారెడ్డి కాలనీ, జల్ పల్లి ప్రాంతాల్లో నివసిస్తున్న ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు శనివారం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పహాడీషరీఫ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. కొత్తగా దుకాణాలు, ఇళ్లు, వ్యాపార సంస్థలు ప్రారంభిస్తున్న వ్యాపారులు, నివాసితులను ఎలాంటి బలవంతపు వసూళ్లు, వేధింపులు, బెదిరింపులకు గురి చేయవద్దని ట్రాన్స్ జెండర్లకు పోలీసులు స్పష్టంగా హెచ్చరించారు. ప్రజలను బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం చట్ట విరుద్ధమని, ఇలాంటి ఫిర్యాదులు వస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్ జెండర్ వ్యక్తులు క్రమశిక్షణ పాటిస్తూ, ప్రజల హక్కులను గౌరవిస్తూ, ప్రాంతంలో శాంతి సామరస్యాలకు సహకరించాలని సూచించారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి:** ఎవరైనా బలవంతపు వసూళ్లు, బెదిరింపులు, వేధింపులకు గురైతే వెంటనే వాగ్వాదానికి దిగకుండా పోలీస్ ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ 112 కు కాల్ చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# పర్యావరణహిత వినాయక చవితికి శ్రీకారం

### ఎంజీ పార్క్‌లో 800 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో నెక్నాంపూర్ డివిజన్ ప్రెసిడెంట్ జితేందర్ మెరుగు ఆధ్వర్యంలో శనివారం ఎంజీ పార్క్‌లో పర్యావరణహిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 800 మట్టి వినాయక విగ్రహాలను స్థానిక కాలనీ వాసులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు. పర్యావరణహిత విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ నిర్వాహకులు చేపట్టిన కార్యక్రమానికి స్థానికులు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జితేందర్ మెరుగు మాట్లాడుతూ.. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా చెరువులు, నీటి వనరులు, మట్టి, పరిసరాలను కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. మన భక్తికి పర్యావరణ పరిరక్షణ తోడైతేనే మన వేడుకలకు మరింత అర్థం ఉంటుంది. ఈ కార్యక్రమానికి స్పందించి పర్యావరణహిత వినాయక విగ్రహాలను స్వీకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని, పర్యావరణహిత వినాయక చవితిని ప్రోత్సహించాలని కోరుతున్నాను అని జితేందర్ మెరుగు అన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. మాజీ కౌన్సిలర్లు కిరణ్, పురుషోత్తం, ముత్యాలు, యాలాల నరేష్, మహిళా ప్రెసిడెంట్ సావిత్రి, కస్తూరి సతీష్, అన్ని కాలనీల ట్రెజరర్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎటిఆర్డబ్ల్యుఎ వైస్ ప్రెసిడెంట్లు శ్రీనివాస్ బలగోని, శేఖర్, జితేందర్ రావు, మామిళ్ల రాజు, నాగార్జున, శివ శంకర్, ధనేష్ తదితరులు హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాలనీ వాసులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు, వాలంటీర్లకు జితేందర్ మెరుగు కృతజ్ఞతలు తెలిపారు.

**రేపు నేతాజీ పార్క్‌లో పంపిణీ...**

పర్యావరణహిత కార్యక్రమాన్ని కొనసాగిస్తూ సెప్టెంబర్ 13న ఉదయం 8 గంటల నుంచి నేతాజీ పార్క్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణహిత వినాయక విగ్రహాలను స్వీకరించాలని కోరారు. భక్తితో గణనాథుడిని ఆరాధిద్దాం.. బాధ్యతతో పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే సందేశంతో కార్యక్రమాన్ని ముగించారు.

# విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్..

### రూ.180 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్

హైదారాబాద్: తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించారు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు.




# శంషాబాద్ జోనల్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు

## కన్వీనర్‌గా బైతి శ్రీధర్ నియామకం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యుల పిలుపు మేరకు రాజేంద్రనగర్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శంషాబాద్ జోన్‌కు సంబంధించి గణేష్ ఉత్సవ సమితి కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ జోనల్ కన్వీనర్‌గా బైతి శ్రీధర్‌ను నియమించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీలను సమన్వయం చేయడం, నిర్వాహకులకు అవసరమైన సహకారం అందించడం, ఉత్సవాల సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవడం వంటి అంశాల్లో జోనల్ కమిటీ కీలక పాత్ర పోషించనుంది. బైతి శ్రీధర్‌ను జోనల్ కన్వీనర్‌గా నియమించడంపై గణేష్ ఉత్సవ సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గణేష్ ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# మణికొండలో మట్టి వినాయకుల పంపిణీ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండలో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తూ, పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు ప్రజలను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మట్టి వినాయకుల ప్రతిమలను వినియోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవచ్చని తెలిపారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విగ్రహాలను స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ చేపట్టిన కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత పద్ధతుల్లో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని నిర్వాహకులు కోరారు.

# భారతీనగర్‌లో ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ

### భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలి: సింధు ఆదర్శ్ రెడ్డి

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 12:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ వార్డు కార్యాలయంలో ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం ఆనందంగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం సింధు ఆదర్శ్ రెడ్డి కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో మంజూరు చేయించి నిర్మించిన వినాయక షెడ్‌ను సందర్శించారు. షెడ్ నిర్మాణానికి కృషి చేసినందుకు కాలనీ ప్రజలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక విగ్రహాలను స్వీకరించారు.



# ఎస్ఐహెచ్ 2026 అంతర్గత హ్యాకథాన్‌లో ఎంజిఐటి విద్యార్థుల ప్రతిభ

## వినూత్న సాంకేతిక పరిష్కారాలతో ఆకట్టుకున్న విద్యార్థులు.. తదుపరి దశకు 50 బృందాల ఎంపిక







**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వాస్తవ ప్రపంచంలో ఎదురవుతున్న సమస్యలకు సాంకేతికత ఆధారిత, వినూత్న పరిష్కారాలను రూపొందించడమే లక్ష్యంగా మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజిఐటి), హైదరాబాద్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్) 2026 అంతర్గత హ్యాకథాన్‌ను శనివారం నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. ఎంజిఐటికు చెందిన వివిధ విభాగాల నుంచి 163 విద్యార్థి బృందాలు హ్యాకథాన్‌లో పాల్గొన్నాయి. మొత్తం 978 మంది విద్యార్థులు ఇందులో భాగస్వాములయ్యారు. ఇందులో 526 మంది బాలురు, 452 మంది బాలికలు ఉన్నారు. ఎస్ఐహెచ్ 2026లోని వివిధ సమస్యా ప్రకటనలను ఎంచుకున్న విద్యార్థి బృందాలు, వాటికి తాము రూపొందించిన పరిష్కారాలను నిపుణుల జ్యూరీ ముందు ప్రదర్శించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), స్మార్ట్ ఆటోమేషన్, ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, సైబర్ భద్రత, సుస్థిరత తదితర రంగాల్లో విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలిచారు. ప్రాజెక్టుల రూపకల్పనలో ఆవిష్కరణాత్మకత, సాధ్యాసాధ్యత, విస్తరణ సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం, సామాజిక ప్రభావం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఎంజిఐటి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి విద్యార్థుల ఉత్సాహం, సృజనాత్మకత, వినూత్న ఆలోచనా విధానాన్ని అభినందించారు. విభిన్న విభాగాల విద్యార్థులు కలిసి పనిచేయడం ద్వారా బృందపని, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు విద్యార్థులను ప్రోత్సహించేందుకు యాజమాన్యం అందిస్తున్న సహకారం, మౌలిక సదుపాయాల ప్రాధాన్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సుధాకర్ రెడ్డి విద్యార్థులు, అధ్యాపక మెంటర్లను అభినందించారు. సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను రూపొందించే దిశగా విద్యార్థులు మరింత కృషి చేయాలని సూచించారు. ఎస్ఐహెచ్ 2026 అంతర్గత హ్యాకథాన్ కన్వీనర్, సిఎస్ఇ విభాగాధిపతి డా. టి.వి. రాజినీ కాంత్ మాట్లాడుతూ.. సంప్రదాయ తరగతి గది అభ్యసనానికి అతీతంగా సమకాలీన సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు హ్యాకథాన్‌లు మంచి అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు. బృందపని, సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, పారిశ్రామిక ఆలోచనా విధానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. కఠినమైన మూల్యాంకన ప్రక్రియ అనంతరం 50 విద్యార్థి బృందాలను ఎస్ఐహెచ్ 2026 తదుపరి దశకు ఎంజిఐటి తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపిక చేశారు. పరిశ్రమలకు చెందిన నిపుణులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి విద్యార్థుల ప్రాజెక్టులను సమగ్రంగా మూల్యాంకనం చేశారు. డీప్‌లూప్ టెక్నాలజీస్, బర్న్‌మేట్, ఫ్లైడ్రానిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లడ్ గార్డ్, ఎల్‌టిటిఎస్, టెక్‌ఫ్లూయెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సెనెకా గ్లోబల్, వాధ్వాని ఫౌండేషన్, లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిఐఎస్‌సిఇ, డెల్టాఎక్స్ ఏఐ, క్యాంప్ ఇండియా తదితర సంస్థలకు చెందిన నిపుణులు విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. విద్యార్థులు సమస్యను గుర్తించిన విధానం, ప్రతిపాదించిన పరిష్కారం, సిస్టమ్ ఆర్కిటెక్చర్, సాంకేతికత వినియోగం, ఆవిష్కరణాత్మకత, సాధ్యాసాధ్యత, ఆశించిన సామాజిక ప్రభావం తదితర అంశాలను జ్యూరీ ముందు వివరించారు. 50 బృందాల ఎంపికతో కార్యక్రమం ముగిసింది. విద్యార్థులు, మెంటర్లు, అధ్యాపక సమన్వయకర్తలు, జ్యూరీ సభ్యులను నిర్వాహకులు అభినందించారు. ఎంజిఐటిలో ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార దృక్పథాన్ని మరింత బలోపేతం చేయడంలో ఎస్ఐహెచ్ 2026 అంతర్గత హ్యాకథాన్ కీలక ముందడుగుగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.



## వినాయక విగ్రహాల నిమజ్జనాలకు రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ పత్తి కుంట (వినాయక్ సాగర్) సిద్ధం

### పత్తి కుంట వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణం

### జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వినాయక నిమజ్జనోత్సవాల కు పత్తి కుంట సిద్ధమైంది. పత్తి కుంట వద్ద వినాయక కొలను ముస్తాబు చేశారు. చెరువు వద్ద రూ. 12 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేశారు. షెడ్డు ను శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, గణేష్ ఉత్సవ సమితి నాయకులతో కలిసి ప్రారంభించారు. భక్తులు, అధికారులు నిలబడటానికి ప్రతి సంవత్సరం తాత్కాలిక టెంట్ లు , షామియానాలు వేసే చోట ఈ సంవత్సరం రూ. 12 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం చేసినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి లు తెలిపారు. పత్తి కుంట మంచినీటి చెరువని ఈ చెరువు లో ప్రతి సంవత్సరం వేలాది వినాయకుల నిమజ్జనాలు జరుగుతుంటాయని తెలిపారు. పత్తి కుంట వినాయక కొలను వద్ద విద్యుత్ దీపాలు, క్రేన్ల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, నిమజ్జనం జరిగే వినాయక ప్రతిమలను ఎప్పటికప్పుడు తొలగించడం లాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నార జరుపుకోవాలన్నారు. వినాయక చవితి, నిమజ్జోనోత్సవాలను ప్రజలు, భక్తులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేటట్లు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ జోనల్ ఈఈ నరేందర్ గౌడ్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధి లు వై. శ్రీధర్ , సామా ఇంద్రపాల్ రెడ్డి, బొక్క బాల్ రెడ్డి, ఎన్ మల్లారెడ్డి, పడమటి శ్రీధర్ రెడ్డి, ఎస్ విజయ్ కుమార్, పలుగుచెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, ఎన్ ధనుంజయ, ఈ వేణు గోపాల్, పెండ్యాల సాయి మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లుగా మూగబోయిన బోర్‌కు మళ్లీ జీవం

### మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీరు అందుబాటులోకి..

### సర్పంచ్ మందుల నాగయ్య



**గుడిబండ, సెప్టెంబర్ 12 క్రైమ్ మిర్రర్):** గుడిబండ గ్రామంలోని పాత గుడిబండ బొడ్రాయి వద్ద గత రెండేళ్లుగా పనిచేయకుండా నిరుపయోగంగా ఉన్న బోర్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బోర్‌ను రిపేర్ చేయించి నీటిని పైపుల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది బోర్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో గత కొంతకాలంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు ఊరట లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ మందుల నాగయ్య మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పనిచేయని బోర్లు, నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. బోర్ మరమ్మతులు పూర్తిచేసి నీటిని అందుబాటులోకి తీసుకురావడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పంచాయతీ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ కోరారు.

# శంకర్‌పల్లిలో కాంగ్రెస్‌కు నూతన నాయకత్వం

### మున్సిపల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా మడపతి చంద్రమౌళి, బొల్లారం వెంకట్‌రెడ్డి

### నియామక పత్రాలు అందజేసిన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నూతన నాయకత్వాన్ని నియమించారు. నూతనంగా ఎంపికైన శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లారం వెంకట్‌రెడ్డిలకు శనివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు తమ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరించే దిశగా నూతన అధ్యక్షులు కృషి చేయాలని అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మడపతి చంద్రమౌళి, బొల్లారం వెంకట్‌రెడ్డిలు తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ శంకర్‌పల్లి మున్సిపాలిటీ, మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు ఉద్యోగ బాటలు.. కోదాడలో కొలువుల జాతర

### 200--250 కంపెనీలు.. వేలాది ఉద్యోగ అవకాశాలు.. ఈ నెల 19న మెగా జాబ్‌మేళా..

### కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణా రావు



**కోదాడ సెప్టెంబర్ 12 క్రైమ్ మిర్రర్ :** కోదాడ నియోజకవర్గ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా ఈ నెల 19న కోదాడ పట్టణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు రావెళ్ల కృష్ణారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో భారీ స్థాయిలో జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు 200 నుంచి 250 ప్రముఖ కంపెనీలను జాబ్‌మేళాకు ఆహ్వానిస్తున్నామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ విద్యార్హతలు కలిగిన వారితో పాటు అర్హత ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కంపెనీల ప్రతినిధులతో నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది మంచి అవకాశమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా జాబ్‌మేళాకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. కోదాడ పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా వివరాలను విస్తృతంగా చేరవేసి, అధిక సంఖ్యలో యువత పాల్గొనేలా చొరవ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల సహకారంతో అందుతున్న ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించి తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని రావెళ్ల కృష్ణారావు పిలుపునిచ్చారు. కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి స్కూల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.